www.prajasakti.com

ప్రజాశక్తి


బుధవారం 17 డిసెంబర్ 2025 | 5 | కాకినాడ



హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన తుమ్మలపల్లి

ప్రజాశక్తి - గండేపల్లి

ఏపి స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాసరావును జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ వైస్ చైర్మన్ తుమ్మలపల్లి సాయి చందు, మండల జనసేన పార్టీ నాయకులు మేడిబోయిన శ్రీను, మాదారపు వీరబాబు, కాయల మణికంఠ, పాలెం బాబీ, గంధం వంశీ పాల్గొన్నారు.



చైర్మన్‌ను అభినందిస్తున్న తుమ్మలపల్లి

సుందరయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

-వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

-ఉత్సాహంగా వ్య.కా.స జిల్లా మహాసభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోరాటయోధుడు, నిరాడంబర ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తితో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాలో ప్రజా పోరాటాలను నిర్వహిస్తుందని, కూలీల సమస్యలపై, అసైన్డ్ భూములను పేదలకు ఇప్పించేలా పని చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 2వ మహాసభ స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన మహాసభ ప్రారంభ సూచికగా సంఘం జెండాను మండల కార్యదర్శి దుప్పి అదృష్టదీపుడు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో ఇటీవల మృతి చెందిన సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు పి.వసంతకుమార్, కె.రాఘవమ్మ శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై పనిచేయడానికి పుచ్చలపల్లి సుందరయ్య స్థాపించిన సంఘం దేశవ్యాప్తంగా అనేక సమస్యలపై పోరాడుతుందన్నారు. ఈ మధ్యకాలంలో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ చర్యలకు నిరసనగా నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అనేక పోరాటాల ఫలితంగా 2005లో యుపిఎ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడానికి బిజెపి మతోన్మాద ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే బిల్లును రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధి కూలీలు వ్యతిరేకించాలన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టే ఈ చట్టాన్ని పరిరక్షించుకోవడానికి నిరంతరం జాగరూకతతో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే వ్యవసాయంలో యాంత్రీకరణ వల్ల పేదలు ఉపాధి కోల్పోయారని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం స్వర్ణాంధ్ర పేరుతో, మోడీ ప్రభుత్వం వికసిత్ భారత్ పేరుతో ఆదాని, అంబానీలకు వ్యవసాయ భూములు అప్పగించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని దీన్ని కార్మికులంతా వ్యతిరేకించాలన్నారు. ఉపాధిలో ఏడాదికి 300 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని కల్పించ లేకపోతే భూమిలేని పేదలకు ఒక్కొక్కరికి 2 ఎకరాల చొప్పున భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మహాసభ సందర్భంగా భవిష్యత్ పోరాటాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ గత మూడేళ్ల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఉపాధి కూలీల సమస్యలు, అసైన్డ్ భూముల సమస్యలు, దళితుల స్మశాన వాటికలు వంటి పోరాటాలను చేసినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని పోరాటాలకు సమాయత్తమౌతామని అన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోర్త రాజశేఖర్, వళ్ళ రాజబాబు, వ్య.కా.స రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరాకుల సింహాచలం, ఐద్వా రాష్ట్ర నాయకురాలు చెక్కా రమణి, రైతు సంఘం జిల్లా నాయకులు అప్పారెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబూరావు, కెవిపిఎస్ మండల కన్వీనర్ విప్పర్తి శ్రీనివాస్ సౌహార్ద సందేశాలను ఇచ్చారు. వ్యవసాయ కూలీల పోరాటాలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శులు నేరేడుమిల్లి త్రిమూర్తులు, చొల్లంగి వెంకటలక్ష్మి అధిక సంఖ్యలో వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు



సంఘ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అదృష్టదీపుడు, ఇతర నాయకులు



మహాసభకు హాజరైన వ్యవసాయ కార్మికులు



ధర్నాలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి

సహకార ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల జెఎసి పిలుపు మేరకు జిల్లా సహకార కార్యాలయం వద్ద ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. జిఒ నెంబర్ 36ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిసిఒ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కే.ఆదినారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి మాట్లాడారు. 2019 పే రివిజన్ తక్షణం అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగులకు గ్రాడ్యుటీ చెల్లించాలని, 62 సంవత్సరాలకు పదవీ విరమణ వయసు జిఒను అన్ని సహకార సంస్థల్లో అమలుచేయాలని డిమాండ్ చేశారు. 2019లో చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాలను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగ సంఘాలతో వేతన ఒప్పందం జరిగి అనేక సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయకుండా ఉద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. 2019లో విడుదల చేసిన జిఒ నెంబర్ 36 ప్రకారం హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసేంతవరకు సహకార ఉద్యోగులు పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ నెల 22న డిసిసిబి బ్యాంకు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, సహకార ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నరసరాజు, జిల్లా కోశాధికారి జి.అప్పలరాజు, అగ్రహారం రెడ్డి, చంటిబాబు, కోలంకి రాము, డి.సుబ్బారావు, గోవిందరెడ్డి, చిట్టియ్య, వొమ్మంగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ముందస్తు జాగ్రత్త అవసరం

ప్రజాశక్తి - శంఖవరం

వ్యాధుల పట్ల విద్యార్థినీ, విద్యార్థులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ సూచించారు. మంగళవారం అన్నవరం సత్యదేవ డిగ్రీ కళాశాల ఆవరణలో సూర్యోదయ హెల్పింగ్ హాండ్స్ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా రోగాల భారి నుంచి బయటపడగలగుతారని అన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్క విద్యార్థి ఆలోచన చేయాలని కోరారు అనంతరం భరత్ డెంటిస్ట్ సహకారంతో డాక్టర్ పి.శివకుమార్ విద్యార్థులు, తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మింటు డైరెక్టర్ చిలుకూరి రాంకుమార్, పర్వత సురేష్, మద్ది రామారావు, పత్తిపాడు జనసేన ఇన్‌ఛార్జ్ బాబి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

నారుమళ్లు త్వరితగతిన వేసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

రబీ సీజన్లో రైతులు నారుమడులు తొందరగా వేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.దుర్గాలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని పవర ఆర్‌ఎస్‌కె వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి వంగపండు మురళీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఫాస్పరస్, బ్యాక్టీరియా, పొటాషియం, మొబలైజింగ్ బ్యాక్టీరియాలను వినియోగించడం వల్ల భూమిలో ఉన్న పొటాష్, ఫాస్పరస్ మొక్కకు లభిస్తాయని అన్నారు. వీటిని ఊడ్చిన నెలలోపు వినియోగించాలని సూచించారు. ఎఒ మురళీధర్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌కెలు, సొసైటీల్లో కావాల్సిన ఎరువులు నిల్వ ఉంచడం జరిగిందని తెలిపారు. రైతుకు ఎకరానికి ఒక బస్తా చొప్పున మూడు విడతలుగా మూడు బస్తాలు కార్డు ద్వారా ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు, ఎఎటిలు, రైతులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం, జగ్గంపేట

పిఠాపురంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఉప్పాడ బస్టాండ్ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె.చిన్న, నాయకులు ఒమ్మి గోవిందు, విశ్వనాథం మాట్లాడారు. ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరగబోయే సిఐటియు 18వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. జనవరి 4న జరిగే బహిరంగసభకు పెద్దఎత్తున కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు డి.సత్యనారాయణ, పి.గోవిందాచారి, బి.అప్పన్న బాబు, గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, సూర్యనా రాయణ, సత్తిబాబు, గాంధీ, సత్యనారాయణ, మోహనచార్యులు, రాజబ్బాయ్, సీతయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేటలోని మంచినీటి చెరువుగట్టు వద్ద సిఐటియు జెండాను సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బోర సత్తిబాబు, అంగన్‌వాడీ యూనియన్ జగ్గంపేట ప్రాజెక్ట్ కార్యదర్శి బి.సుజాత, సెక్టార్ లీడర్ భవానీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. చంటమ్మ, ఎస్.ప్రమీలరాణి, శ్రీవాణి పాండే, డి.జ్యోతి, చెల్లాయమ్మ, మణికుమారి పాల్గొన్నారు.



పిఠాపురంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు శ్రేణులు

అర్జీల శాశ్వత పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్‌ఎస్‌లో వస్తున్న అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ అపూర్వభరత్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ వెంకటరావు, ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, శ్రీరమణి, డివిజన్ అభివృద్ధి అధికారి పి.వాసుదేవరావుతో కలిసి పిజిఆర్‌ఎస్‌పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గత ఏడాది జూన్ 15 నుంచి జిల్లాలో 41,694 అర్జీలు స్వీకరించగా ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీ వరకూ 36,463 అర్జీలను పరిష్కరించామన్నారు. మిగిలినవి ఎస్‌ఎల్‌ఎ పరిధిలో ఉన్నాయని ఆయన వివరించారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యవంతమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారుని సమస్యను దృష్టిలో ఉంచుకుని సరైన పరిష్కారం ఇవ్వాలన్నారు. పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారం పట్ల కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. ఇందుకు జిల్లాస్థాయి అధికారులు తరచుగా తమ పరిధిలోని కార్యాలయాలను తనిఖీ చేయాలని సూచించారు. ఒకే అంశంపై మళ్ళీ మళ్ళీ దాఖలయ్యే దరఖాస్తులను సంబంధిత జిల్లా స్థాయి అధికారులు స్వయంగా పరిశీలించి అర్జీదారునితో నేరుగా మాట్లాడాలన్నారు. రెవెన్యూ, రీ సర్వే ఇతర భూ తగాదాలకు సంబంధించిన సమస్యలే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు దాఖలవుతున్నాయన్నారు. వీటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలోని రెవెన్యూ, సర్వే ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తప్పనిసరిగా గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెసి అపూర్వభరత్

ఏలేశ్వరంలో రక్తదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

టిడిపి నాయకుడు, స్థానిక వార్డు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, ఎండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, పెంద్ర శ్రీను, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో చైర్మన్‌లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్, నాయకులు సామంతుల గోపి, గొల్లపూడి త్రిమూర్తులు, పలివెల శ్రీనివాస్, భగతా శ్రీను, రెడ్డి రాజు, పలువుల వెంకటేష్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

నేడు పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి - పెద్దాపురం

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో 'పజులుల్లాఖాన్-షేక్ మదీనా జీవిత విశేషాల' పుస్తకం ఆవిష్కరణ జరుగుతుందని సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సయ్యద్ నశీర్ అహమ్మద్ ఈ పుస్తకాన్ని రచించారన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగే ఈ సభలో పెద్దాపురం చరిత్ర పరిశోధకులు వంగలపూడి శివకృష్ణ, పలువురు కవులు, రచయితలు, కళాకారులు పాల్గొంటారన్నారు.

అబ్బుర పరిచిన చిన్నారుల సైన్స్ ప్రదర్శనలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక పిఎం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో చిన్నారులు ప్రదర్శించిన సైన్స్ ప్రతిభ అబ్బురపరిచింది. ఏడు విభిన్న విభాగాల్లో విద్యార్థులు తమ గైడ్ టీచర్ల ప్రోత్సాహంతో వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి. పుల్లయ్య పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ తాండ్ర శ్యామ్‌సుందర్, శ్రీనివాస్, పలువురు గైడ్ టీచర్లు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలకు న్యాయనిర్ణేతలుగా స్థానిక ప్రభుత్వ కళాశాలకు చెందిన జగదీశ్వర రావు, కె.ప్రదీప్‌కుమార్, జి.ఆదిలక్ష్మీ, పి.లక్ష్మీ ప్రసన్న, సిహెచ్.విజయలక్ష్మీ వ్యవహరించారు.



బహుమతులు అందిస్తున్న ఎంఇఒలు, ఇతరులు

రైతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కరప

కూటమి ప్రభుత్వం రైతన్నకు అండగా ఉంటుందని ఎంఎల్‌ఎ పంతం నానాజీ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌బికె వద్ద సొసైటీ అధ్యక్షులు సైనివరకు భవనశంకర్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా కార్డును అందజేసి ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరప మండలంలో రైతులకు ముందుగానే 540 మెట్రిక్ టన్నులు యూరియాను సిద్ధం చేయడం జరిగిందన్నారు. సొసైటీలు, ఆర్‌బికెలు, ప్రయివేటు డీలర్ల వద్ద యూరియా సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎఒ ఐ.సత్య, ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్, ఆత్మ ఛైర్మన్ శేఖర్, డిసి ఛైర్మన్ పిజి.సత్యనారాయణ, సొసైటీ ఛైర్మన్ దూడల నారాయుడు, నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, రెడ్డిపల్లి నారాయణరావు, గంట వీరన్నచౌదరి, తదితరులు పాల్గొన్నారు.



యూరియా కార్డులను పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

జగ్గంపేటలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

టిడిపి జిల్లా అధ్యక్షునిగా మరోసారి జ్యోతుల నవీన్‌ను నియమించడంపై పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక జివిఆర్ థియేటర్స్ వద్ద కోలాహలంగా బాణా సంచా కాల్చారు. నవీన్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడపా భరత్, ఎస్‌విఎస్.అప్పలరాజు, జీను మణిబాబు, తోట రవి, వీరంరెడ్డి కాశిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, పైడిపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ను తినిపిస్తున్న జ్యోతుల నవీన్

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం గ్రామస్థాయి అధికారులకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పై శిక్షణను ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులలో ఎంపిడిఒ సెలెట్ రాజు మాట్లాడుతూ అధికారులందరూ ఇంటింటా పర్యటించి కుటుంబంలో ప్రతి ఒక్కరు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో పాల్గొనే విధంగా చూడాలని తెలిపారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

నేడు మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - పెద్దాపురం


స్థానిక పద్మనాభ కాలనీలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 17వ తేదీ మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించబడుతుందని మండల విద్యాశాఖాధికారి ఈరంకి ప్రభాకరశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొంటారని తెలిపారు. మండల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు రూపొందించిన సైన్స్ అంశాలను ప్రదర్శిస్తారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ఎగ్జిబిషన్ మండల పరిధిలోని విద్యార్థులు తిలకిస్తారన్నారు. సాయంత్రం జరిగే ముగింపు సభలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తారన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకం, ఈవ్‌టీజింగ్, మహిళల భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థినులకు స్థానిక బాలికల హైస్కూల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ఎన్.రమేష్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ పి.కిశోర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



బాల్య వివాహాలపై అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ కమ్యూనిటీ భవనంలో ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ తమ నివాస ప్రాంతాలలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బాల్యవివాహాల వల్ల అనర్థాలు, అనారోగ్య సమస్యలు వంటి వాటిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి చేపట్టే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం 300 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు 5 జి స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ, ఎఎంసి ఛైర్‌పర్సన్ మణికుమారి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, బడుగు శ్రీకాంత్, నూనె రామారావు, అడబాల కుమారస్వామి, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** మండలంలోని కొండేవరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి పాల్గొని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. క్రాఫ్ కోఆర్డినేటర్ బి.కుమారి బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం ఇజ్జన.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు, క్రాఫ్ట్ ఎన్జీవో సోషల్ వర్కర్ చంద్రిక, విద్యార్థులు పాల్గొన్నారు. **కరప** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పంతం నానాజీ పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా అందరూ కలిసి తీర్చిదిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జి స్మార్ట్ ఫోన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జె.శ్రీనివాస్, తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, పెంకె శ్రీనివాస్‌బాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డిసి ఛైర్మన్ పిజి.సత్యనారాయణ, భోగిరెడ్డి కొండబాబు, ఆత్మ ఛైర్మన్ చంద్రశేఖర్, ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్, తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సిహెచ్‌ఎస్‌కె.దుర్గాదేవి పాల్గొని మాట్లాడారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దాపురంలో ఫోన్లు అందజేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప



కరపలో అంగన్‌వాడీలకు ఫోన్లు అందజేస్తున్న ఎంఎల్‌ఎ పంతం

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సామర్లకోటకు చెందిన డి.పండు, డి.అక్షయ్‌కుమార్ మోటార్ బైక్ పై ప్రత్తిపాడు వెళుతుండగా జి.రాగంపేట వద్ద బైకు అదుపుతప్పింది. దీంతో ఆ యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారికి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం యానాం నుంచి అమలాపురం ఊకలోడుతో ట్రాక్టర్ వెళుతోంది. ఈ సమయంలో నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బొండాయికోడు తూము సెంటర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్ స్కూటీపై వెళ్తున్న మహిళను తప్పించబోయాడు. దీంతో ట్రాక్టర్ పంట కాలువలోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఉప్పలగుప్తం మండలం కూనవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వరసాల సత్య నారాయణ (58) మృతి చెందాడు. స్కూటీపై వెళ్తున్న మహిళకు గాయలయ్యాయి. మృతునికి భార్య నారాయ ణమ్మ, ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మరణం

ప్రజాశక్తి - చాగల్లు

పసివేదల రైల్వే స్టేషన్ ట్రాక్ మధ్యలో గుర్తుతెలియని 40 ఏళ వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిఆర్‌పి ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9490617090, 7013360296 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

405.7 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గోకవరం

405.7 కేజీల గంజాయిని గోకవరం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కామరాజుపేట శివారులో రోడ్డు పక్కన అనుమానాస్పదంగా ఉన్న వ్యాన్‌పై గోకవరం ఎస్.ఐ పవన్ కుమార్‌కు సమాచారం వచ్చింది. ఎస్ఐ సిబ్బందితో వెళ్లి వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో మొత్తం 22 బస్తాల్లో 405.7 కేజీల గంజాయి గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని పొట్టిలంక 216 జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కడియపులంక నుంచి వస్తున్న లారీ పొట్టిలంక జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన డివైడర్ నుంచి వేమగిరి వైపు వెళ్లేందుకు యూటర్న్ తిరుగుచుండగా బైకుపై వస్తున్న కడియపులంకు చెందిన కర్రి సూరిబాబు (35) లారీని వెనుక భాగంలో బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ మౌనిక

విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ వి.మౌనిక అన్నారు. మంగళవారం స్థానిక వశిష్ట జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు, బాలికలకు అండగా అనేక చట్టాలు ఉన్నాయన్నారు. ఈ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువలతో విద్యాభివృద్ధి సాధించి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. ఈ సదస్సులో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో బ్లడ్ గ్రూప్ పరీక్షలు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ప్రిన్సిపల్ చెన్నారావు ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకులు పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.బాలరాజు, డిగ్రీ మొదటి, రెండోవ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కరప

జిల్లా అడిషనల్ ఎస్‌పి పాటిల్ దేవరాజ్ మానిష్ స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీలు చేపట్టారు. పోలీస్ సిబ్బంది డ్యూటీ రోస్టర్, ప్రాథమిక రిపోర్ట్ రికార్డులు, చార్జ్ మెమోలు, క్రిమినల్, సివిల్ కేసులు వివరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, దేవాలయాలు, బడులు, అంబేద్కర్ విగ్రహాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ టి.సునీతను ఆదేశించారు.

బాల్య వివాహాలు సామాజిక దురాచారం : జెసి

ప్రజాశక్తి - కాకినాడ

బాల్య వివాహాలు సామాజిక దురాచారమని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్ వివాహ ముక్తభారత్ 100 రోజులు కార్యక్రమంపై రూపొందించిన గోడ పత్రికను కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాల బాలికలు తమ బాల్యాన్ని కోల్పోవడమే కాకుండా వారి యొక్క విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధి, భవిష్యత్తుపై ప్రభావం పడుతుందన్నారు. బాల్య వివాహాలు నిర్మూలించుటలో ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని కోరారు. బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమం మూడు దశలుగా జరుగుతుందన్నారు. మొదటి దశలో పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల్లో ఈ నెల 31 వరకూ అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. రెండవ దశ వచ్చే జనవరి 1 నుంచి 31వరకూ దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, వివాహ మందిరాలు, బ్యాండ్ పార్టీలు వంటి వివాహ సంబంధిత సేవా ప్రదాతలపై దృష్టి పెట్టాలన్నారు. మార్చి 8 వరకు మూడవ దశలో కమ్యూనిటీ స్థాయి యాజమాన్యాన్ని బలోపేతం చేయడానికి దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ సిహెచ్.లక్ష్మి, డిఎంహెచ్ఒ జె.నరసింహనాయక్, బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు, బాలల పరిరక్షణ విభాగం సంరక్షణాధికారులు కె.శ్రీనివాసరావు, జె.విజయ, సోషల్ వర్కర్స్ ఎస్.చిన్నబాబు, ఆర్.దుర్గాభవాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జెసి అపూర్వభరత్, ఇతర అధికారులు

18న రాష్ట్ర వ్యాప్త ఆందోళన

ప్రజాశక్తి - సామర్లకోట

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మడగల రమణ అధ్యక్షతన పెద్దాపురం నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు నిరసనగా 17 మెడికల్ కాలేజీల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26వ తేదీన సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సిపిఐ పతాకాలను ఆవిష్కరించాలని, 27న సామర్లకోటలో శత వసంత ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, జిల్లా నాయకులు మడగల రమణ, అర్జున రావు, సూరిబాబు, చిట్టిబాబు, బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టి.మధు

మెడికవర్‌లో ఎండోస్కోపిక్ స్పైన్ శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి - కాకినాడ


డాక్టర్ చందు లింగోలు

స్థానిక మెడికవర్ హాస్పిటల్స్‌లో వెన్నెముక సమస్యలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఎండోస్కోపిక్ స్పైన్ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి జనరల్ సర్జన్ డాక్టర్ చందు లింగోలు తెలిపారు. కాకినాడలోనే తొలిసారిగా ఈ స్థాయి ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. వెన్నెముక సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ విధానంలో చేసే శస్త్రచికిత్సలు ఓపెన్ స్పైన్ సర్జరీతో పోలిస్తే మరింత సురక్షితమైనవని, తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, చిన్న కోతతో కూడిన శస్త్రచికిత్స, త్వరగా కోలుకోవడం వంటి అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. వెన్నెముక డిస్క్ సమస్యలు, నరాలపై ఒత్తిడి, నడుము, మెడ నొప్పులు వంటి సమస్యలకు ఈ చికిత్సలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయన్నారు. ప్రజలు ఖరీదైన చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, కాకినాడలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్పైన్ శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉందన్నారు.


నూతన గ్రామ కమిటీ నాయకులతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి

జనసేన గోకివాడ గ్రామ కమిటీ నియామకం

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని గోకవాడ గ్రామ జనసేన కమిటీని మంగళవారం పార్టీ ముఖ్య నాయకులు నియమించారు. జనసేన పార్టీ నాయకుడు కాయల పవన్‌కుమార్ అధ్యక్షునిగా, బూత్ ఇన్‌ఛార్జులుగా దడాల చిన్నబాబు, గాది శివగణేష్, నామా రాంబాబును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి నియామక పత్రాలను అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గోకివాడ సర్పంచ్ కీర్తి హరినాథ్‌బాబు, సుందర శ్రీనివాస్, గరగ కొండలరావు, గ్రామ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూతాపాన్ని తగ్గించడమే లక్ష్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు

వాతావరణంలో సమతుల్యత పాటించడం ద్వారా భూతాపాన్ని తగ్గించవచ్చని సమత వాలంటరీ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెబ్బాప్రగడ రవి అన్నారు. మంగళవారం కోరింగ బయోడైవర్సిటీ కేంద్రంలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అధ్యక్షతన విశాఖపట్నంకు చెందిన సమత ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల వల్ల ప్రభావితమయ్యే దేశాలకు జిసిఎఫ్ ఆర్థిక సహకారం అందిస్తుందని అన్నారు. కోరంగి అభయారణ్యంలో మొక్కల పెంపకం ద్వారా ఆయా ఇడిసిలలో అనుబంధంగా ఉన్న మత్స్యకారులకు, రైతులకు జీవనోపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా స్వతంత్ర పరిహార వ్యవస్థ (ఐఆర్‌ఎం) పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమత కో ఆర్డినేటర్స్ జి.సైమన్, కె.సతీష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఎస్. వీరభద్రరావు, కె.సిద్దార్థ, బీట్ అధికారులు కె.మహేష్, జి.గోపీనాగేంద్ర కుమార్, ఇడిసిల ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అటవీ శాఖ అధికారులు

వృద్ధాశ్రమ నిర్మాణ పనులపై సమీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానికంగా నిర్మిస్తున్న వృద్ధాశ్రమ నిర్మాణ పనులను మంగళవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సమీక్షించారు. నిర్మాణ పనులను పరిశీలించడంతోపాటు, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, టిడిపి నాయకులు రంది సత్యనారాయణ, నూనె రామారావు, జల్దాన్ని సుబ్రహ్మణ్యం, రేలంగి వెంకటరావు పాల్గొన్నారు.

నూనె గింజల పంటలపై అవగాహన

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గంగవరం గ్రామంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యాలయం, పెద్దాపురం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నూనె గింజల పంటలపై మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్, శర్మ నువ్వు పంటల సాగులో మెలకువలను వివరించారు. నూతన రకాల సాగుతో పాటు చీడ పీడలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఈశ్వరరావు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఫిబ్రవరి 14న ఓటర్ల జాబిత తుది ప్రచురణ

ప్రజాశక్తి - యానాం



యానాం నియోజక వర్గానికి సంబంధించి ఓటర్ల జాబితా తుది ప్రచురణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న వెల్లడిస్తామని ఆర్ఎఒ, ఓటర్ల నమోదు అధికారి అంకిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2025 అక్టోబర్ 30 నాటికి మొత్తం 40,043 మంది ఓటర్లు ఉన్నారని, అయితే ఎస్ఐఆర్‌లో సేకరించబడి డిజిటలైజేషన్ చేయబడిన ఫారాలు 37,032 ఉండటంతో 92.48 శాతం ఉన్నారన్నారు. ఇప్పటి వరకు చిరునామాలో లభించని ఓటర్లు 3,011 ఓటర్లు ఉన్నారని, మరణించిన ఓటర్లు 636, శాశ్వతంగా ఇతరప్రాంతాలకు మారిన ఓటర్లు 1168, ఇతరప్రాంతాల్లో నమోదైన గుర్తించబడిన ఓటర్లు 53, గుర్తించలేని ఓటర్లు 1091, ఇతరులు 63 మంది ఉన్నట్లు తెలిపారు. మొత్తం ఈనెల 16 నాటికి యానాంలో 18,036 మంది పురుష ఓటర్లు, 18996 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. వీటిపై ఓటర్స్ ఇసిఐ.జిఒవి. ఇన్ ద్వారా క్లయిమ్ లు, అభ్యంతరాలు దాఖలు చేయడానికి వచ్చే ఏడాది జనవరి 15 వరకు కాలపరిమితి ఉందన్నారు. ఎన్నికల జాబితా తుది ప్రచురణ 2028, ఫిబ్రవరి 14న జరుగుతుందన్నారు.


మాజీ సైనికులను సత్కరిస్తున్న ఐటిఐ ప్రిన్సిపల్ సుధాకర్

ఘనంగా విజయ్ దివస్

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో స్థానిక మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాలలో విజయ్ దివాస్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు ఎన్.వెంకటరమణ, జి.సాయిబాబు పాల్గొని మాట్లాడారు. అమర జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం మాజీ సైనికులను ఐటిఐ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మన్నే కిరణ్, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యానాంలో హీరో రోషన్ సందడి

ప్రజాశక్తి - యానాం

మోగ్లీ సినిమాలో నటించిన యానాంకి చెందిన రాజీవ్ కనకాల కుమారుడు రోషన్ కనకాల మంగళవారం యానాంలో సందడి చేశారు. ఆయనకు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను రోషన్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కారించారు. ఈ సందర్భంగా రోషన్‌తోపాటు, హీరోయిన్ సాక్షిసాగర్‌ను ఎంఎల్ఎ సత్కరించారు. తొలుత స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న కనకాల తాతయ్య విగ్రహానికి రోషన్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం చింతా వారి వీధి దంగేటి లేన్, యర్రా గార్డెన్స్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళం

ప్రజాశక్తి - కాకినాడ

సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మెప్మా సిబ్బంది సేకరించిన రూ.8 లక్షల700ల చెక్కును మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, మెప్మా పీడీ బి.ప్రియంవదతో కలిసి జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎం.కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మాజీ సైనికుల పునరావాసం, సంక్షేమం, అమరులైన సైనికుల కుటుంబం సంక్షేమానికి ఉపయోగించే సాయుధ దళాల పతాక నిధికి జిల్లాలోని 7 మున్సిపాలిటీలలోని 8 వేల మంది మెప్మా సిబ్బంది ప్రజల నుంచి రూ.8 లక్షల 700లు సేకరించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సేకరించి సాయుధ దళాల పతాక నిధికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా, సైనిక వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.



విరాళం చెక్కును అందజేస్తున్న జెసి, డ్వామా పీడీ

తడి, పొడి చెత్తపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన అవసరమని, అందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి పి.అన్నామణి సూచించారు. మంగళవారం మండలంలోని ఎకె.మల్లవరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు, చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి తడి, పొడి చెత్తను వేరుచేసి ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నీతిపూడి సెలట్ రాజు, ఇఒపిఆర్‌డి వి.సాగర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గీతాభార్గవి, ఎ.రామయ్యదొర, మణిబాబు పాల్గొన్నారు.


వివరాలను తెలుసుకుంటున్న డిపిఒ అన్నామణి

ప్రధాన ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ మణికుమార్, సిబ్బంది విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. స్థానిక ఉప్పాడ రోడ్ సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్ సెంటర్, స్టువార్ట్‌పేట, రైల్వే స్టేషన్ ఆవరణలోనూ ఫుట్ పెట్రోలింగ్‌తోపాటు చుట్టు పక్కల ఉన్నటువంటి హైడింగ్ ప్లేస్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టారు. ప్రధాన కూడళ్లలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడం ఏదైనా సమాచారం ఉంటే త్వరితగతిన పోలీసు వారికి సమాచారం అందజేయాలని కోరారు.


ఫుట్ పెట్రోలింగ్‌లో పోలీసులు